క్లుప్తంగా

'గెస్ట్'కు దరఖాస్తుల ఆహ్వానం

గార్ల: గార్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 5 గెస్ట్ లెక్చరర్ పోస్టులకు సెప్టెంబర్ 1వ తేదీ లోపు అర్హులైన వారు కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.రాజు శనివారం తెలిపారు. గెస్ట్ లెక్చరర్ పోస్టుల్లో వాణిజ్యశాస్త్రం-1, రసాయనిక శాస్త్రం-1, భౌతికశాస్త్రం-1, గణితశాస్త్రం-1, వృక్షశాస్త్రం -1 పోస్టులు ఖాళీ ఉన్నాయన్నారు. సంబంధిత సబ్జెక్ట్‌ల్లో ఓసీ, బీసీ అభ్యర్థులు పీజీలో 55శాతం మార్కులు, ఎస్సీ, ఎస్టీలు 50శాతం మార్కులు కలిగి ఉండాలన్నారు. పీజీతోపాటు నెట్, స్లెట్, సెట్, పీహెచ్‌డీ అదనపు అర్హతలు కలిగిన వారికి తొలి ప్రాధాన్యత ఇస్తామన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు సెప్టెంబర్ 2వ తేదీన మహబూబాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇంటర్వ్యూలు ఉంటాయని ఆయన వెల్లడించారు.

పోలీసుల సేవలు స్ఫూర్తిదాయకం

మహబూబాబాద్ రూరల్: పదవీ విరమణ పొందిన పోలీసు అధికారుల సేవలు స్ఫూర్తిదాయకమని ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ అన్నారు. ఎస్బీ ఎస్సై ఎం.సంజీవరెడ్డి, ట్రాఫిక్ ఎస్సై డి.నాగేశ్వరరావుల పదవీ విరమణ జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఎస్పీ వారిని సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో ఎస్బీఐ చంద్రమౌళి, ఆర్‌ఐలు అనిల్ కుమార్, నాగేశ్వరరావు, సోములు పాల్గొన్నారు.

కష్టాలను ధైర్యంతో ఎదుర్కోవాలి

గార్ల: కష్టాలు ఎదురైనప్పుడు ధైర్యంతో ఎదుర్కోవాలే తప్ప ఆత్మహత్యలకు పాల్పడవద్దని ఆత్మహత్యల నివారణ కమిటీ చైర్మన్ డాక్టర్ పరికిపండ్ల అశోక్ సూచించారు. శనివారం గార్లలో ఆత్మహత్యల నివారణ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం ఆత్మహత్యల నివారణపై రూపొందించిన కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించి ఆత్మహత్యలు చేసుకోబోమని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఏఎస్సైలు వెంకట్‌రెడ్డి, రవీందర్, సామాజిక వేత్తలు కె వెంకన్న, జి సత్యనారాయణ, అబ్దుల్‌కలాం పాల్గొన్నారు.

గణనాథుడి నిమజ్జనం



మరిపెడ రూరల్: మరిపెడ పోలీస్‌స్టేషన్ పరిధి మండపంలో ఏర్పాటు చేసిన గణనాథుడి నిమజ్జనాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఎస్సై బొలగాని సతీష్ ఆధ్వర్యంలో ఊరేగింపుగా వెళ్లి మండలంలోని పురుషోత్తమాయగూడెం బ్రిడ్జి సమీపంలోని ఆకేరు వాగులో నిమజ్జనం చేశారు.
చిన్నగూడూరు: మండలంలోని ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన గణేష్ నిమజ్జన వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు.

'డ్రోన్'తో నానో యూరియా పిచికారీ

కురవి: నానో యూరియా వాడడం వల్ల రైతులకు మేలు, లాభదాయకంగా ఉంటుందని సీరోలు వ్యవసాయ శాఖ అధికారి చాయారాజ్ అన్నారు. శనివారం సీరోలు మండలం కాంపల్లి గ్రామంలో మోహన్‌రెడ్డి, రమేష్‌లకు చెందిన వరిపొలంలో డ్రోన్‌తో నానో యూరియా పిచికారీ(డెమో) చేశారు.

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైంది



గూడూరు: ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదని ఎంఈఓ జె. రవికుమార్ అన్నారు. మండలంలోని మచ్చర్ల ప్రాథమిక పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు, దళితరత్న, సామాజిక ఉద్యమ నేత పార్నంది రామయ్య ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులతో పాటు ఎస్టీఓ ఎండీ రవి పాల్గొన్నారు.
దోర్నకల్: మండలంలోని ముల్కలపల్లి జెడ్పీ హెచ్‌ఎస్‌లో హెచ్‌ఎం రుక్మాంగధరరావుతో పాటు ఇంగ్లీష్ ఉపాధ్యాయులు అక్బర్‌ఖాన్ పదవీవిరమణ పొందడంతో శనివారం ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈఓ ఆంగోత్ లక్ష్మా, పీఆర్టీయూ మహబూబాబాద్, ఖమ్మం జిల్లా అధ్యక్షుడు సతీష్‌రెడ్డి, శేఖర్, జిల్లా ఉపాధ్యక్షుడు సీహెచ్ శ్రీధర్, యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు నామా వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.
దంతాలపల్లి: విద్యార్థులను తీర్చి దిద్దేది ఉపాధ్యాయులేనని ఎంఈఓ శ్రీదేవి అన్నారు. మండలంలోని కుమ్మరికుంట్ల గ్రామంలోని ఎంపీపీఎస్ పాఠశాలలో ఉపాధ్యాయుడు తెంతల వెంకన్న పదవీ విరమణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం వేణుమాధవరెడ్డి, హెచ్‌ఎం యాకయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యూరియా కొరత.. రైతుల వెత



మహబూబాబాద్ రూరల్: ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట రైతుల ఆందోళన

మహబూబాబాద్ రూరల్: యురియా సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం సమీపంలో తొర్రూరు ప్రధాన రహదారిపై రైతులు శనివారం రాస్తారోకో నిర్వహించారు. టౌన్, రూరల్ ఎస్సైలు ప్రశాంత్ బాబు, శివ, దీపిక, సూరయ్య రైతుల వద్దకు వచ్చి శాంతింపజేశారు. రైతుల రాస్తారోకోకు ఎస్‌ఎఫ్‌ఐ, రైతు సంఘం నేతలు జ్యోతిబసు, రాకేశ్, పట్ల మధు, నల్లపు సుధాకర్ మద్దతు తెలిపారు.
కొత్తగూడ: మండలంలోని పొగుళ్లపల్లి పీఏసీఎస్‌కు యూరియా వస్తుందని తెలుసుకున్న రైతులు శుక్రవారం అర్ధరాత్రి నుంచే కేంద్రం వద్ద వేచి ఉన్నారు. గాంధీనగర్‌కు చెందిన మహిళా రైతు మల్లెల రామక్క సొమ్మసిల్లి పడిపోయింది. 500మంది రైతులకు యూరియా బస్తాలను సీఐ సూర్యప్రకాశ్, ఎస్సై రాజ్‌కుమార్, ఏఓ ఉదయ్ పంపిణీ చేశారు.
కురవి: మండలంలోని గుండ్రాతిమడుగు(విలేజి) సొసైటీకి శనివారం యూరియా వచ్చింది. విషయం తెలియడంతో చుట్టు పక్కల గ్రామాలకు చెందిన సొసైటీ సభ్యులు, రైతులు వందలాది మంది చేరుకున్నారు. ఈక్రమంలో ఎస్సై సతీష్ ఆధ్వర్యంలో 300 బస్తాల యూరియాను పంపిణీ చేశారు.
గూడూరు: మండల కేంద్రంలోని ప్రధాన బస్టాండ్ సెంటర్ జాతీయ రహదారిపై యూరియా కోసం రైతులు శనివారం ధర్నా చేపట్టారు. యూరియా సోమవారం వస్తుందని బోర్డు పెట్టారు. దీంతో కోపోద్రిక్తులైన రైతులు ధర్నా నిర్వహించారు. అక్కడికి చేరుకున్న సీఐ జి.సూర్యప్రకాశ్ రైతులతో మాట్లాడారు. సోమవారం తప్పకుండా యూరియా ఇచ్చే ఏర్పాటు చేస్తానని చెప్పగా ఆందోళన విరమించారు.
నర్సింహులపేట: మండలంలోని పీఏసీఎస్‌కు రైతులు శనివారం యూరియా కోసం అధిక సంఖ్యలో తరలివచ్చారు. యూరియా రాకపోవడంతో అంబేడ్కర్ సెంటర్‌లో మహబూబాబాద్‌కు వెళ్లే ప్రధాన రహదారిపై రైతులు బైఠాయించి ఆందోళన చేశారు. ఎస్సై మాలోతు సురేష్ విచ్చేసి రైతులతో, వ్యవసాయశాఖ అధికారులతో మాట్లాడి నచ్చజెప్పి ఆందోళన విరమింపజేశారు. యూరియా బస్తాలు ఇప్పించాలని మహిళారైతు ఉప్పలమ్మ ఏఓ వినయ్‌కుమార్ కాళ్లమీద పడింది.
కేసముద్రం: మండలంలోని కల్వల గ్రామంలో శనివారం రైతులు రైతువేదిక భవనం ఎదుట తెల్లవారుజాము నుంచే చీకట్లో పడిగాపులు పడ్డారు. ఈ క్రమంలో ప్రధాన రహదారిపై రైతులు క్యూలో నిలబడగా, ట్రాఫిక్‌కు ఇబ్బందికరంగా మారడంతో పక్కనే ఉన్న మోడల్ స్కూల్‌లో టోకెన్‌లు ఇస్తున్నట్లు తెలిపారు. క్యూలోనిల్చున్న రైతులంతా మోడల్‌స్కూల్ ఆవరణలోకి పరుగులు తీశారు. దీంతో అక్కడ పరిస్థితి గందరగోళంగా మారింది. తీరా స్కూల్ పిల్లలు పాఠశాలకు వస్తుండటంతో, మళ్లీ రైతువేదిక వద్దే టోకెన్లు ఇవ్వడం ప్రారంభించారు. ఓ మహిళా రైతు కళ్లు తిరిగి సృహ కోల్పోగా, ఆ తర్వాత తేరుకుని వెళ్లిపోయింది.



గూడూరు: రైతులతో మాట్లాడుతున్న సీఐ సూర్యప్రకాశ్



కేసముద్రం: కల్వల రైతువేదిక వద్ద బారులుదీరిన రైతులు



కురవి: రైతువేదిక ఎదుట బారులుదీరిన రైతులు

ఓటరు జాబితాపై అభ్యంతరాలు తెలపాలి



గార్ల: నాయకులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ మంగమ్మ

మరిపెడ రూరల్: ఓటర్ జాబితా, పోలింగ్ కేంద్రాలపై అభ్యంతరాలు ఉంటే తెలపాలని ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయం సమావేశ హాలులో అఖిల పక్ష నాయకులు, అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అభ్యంతరాలు ఈనెల 31లోపు తెలియజేయాలని ఎంపీడీఓ కోరారు.

గార్లలో..
గార్ల: ఓటర్ల జాబితాలో ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలపాలని ఎంపీడీఓ మంగమ్మ సూచించారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు.

పెద్దవంగరలో..
పెద్దవంగర: పారదర్శక మ్యాపింగ్‌పై దృష్టి సారించేందుకు తగు చర్యలు చేపట్టుతామని ఎంపీడీఓ వేణుమాధవ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల సమన్వయ సమావేశం చేపట్టారు.

గూడూరులో..
గూడూరు: మండల పరిషత్ కార్యాలయంలో శనివారం గ్రామ పంచాయతీ ఓటర్ జాబితాపై పలు పార్టీల ముఖ్య నాయకులతో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ, ఎంపీఓ సత్యనారాయణ సమావేశం నిర్వహించారు.
దోర్నకల్: పోలింగ్ బూతుల వారీగా ప్రకటించిన ఓటరు జాబితాపై స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో వివిద రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ శ్రీనివాసనాయక్ ఆధ్వర్యంలో నిర్వమించిన సమావేశంలో ఓటరు జాబితా ప్రతులను రాజకీయ నాయకులకు పంపిణీ చేశారు.
తొర్రూరు: ఎంపీడీఓ కార్యాలయంలో ఓటరు జాబితాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ వెంటేశ్వర్లు, తహసీల్దార్ శ్రీనివాస్ అధ్యక్షత వహించారు.
నెల్లికుదురు: ఓటరు జాబితాలో అభ్యంతరాలు ఉంటే ఫిర్యాదు చేయాలని ఎంపీడీఓ సింగారపు కుమార్ సూచించారు. ఎంపీడీఓ కార్యాలయంలో పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు.

ఆటలతో పిల్లల్లో శారీరక ఎదుగుదల



వేడుకల్లో పాల్గొన్న సూపర్‌వైజర్, అంగన్‌వాడీలు

మరిపెడ రూరల్: మరిపెడ మండలం వీరారం గ్రామంలోని అంగన్‌వాడీ సెంటర్1, 2లు సంయుక్తంగా ఎర్లీ చైల్డ్ హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్ (ఈసీసీఈ) డేను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఉష పాల్గొని మాట్లాడుతూ విద్యతో పాటు ఆటపాటల వల్ల పిల్లల్లో శారీరక ఎదుగుదల అభివృద్ధి చెందుతుందన్నారు. చిన్నారులు వేసిన బొమ్మలను ప్రజంటేషన్ చేశారు. ప్రీస్కూల్ ఆక్టివిటీస్ గురించి, అదేవిధంగా బాలింతలకు, గర్భిణులకు పౌష్టికాహారం గురించి తెలియజేశారు. అనంతరం పలువురి చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం మంజువాణి, అంగన్‌వాడీ టీచర్ల గంట కవిత, ఏర్పుల శ్రీవాణి, ఆశ జమున పాల్గొన్నారు.

షేడ్‌నెట్లలో నర్సరీ సాగు లాభదాయకం



రైతులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న దిలీప్ కుమార్

మహబూబాబాద్ రూరల్: షేడ్‌నెట్లు ఏర్పాటు చేసుకుని వాటిల్లో నర్సరీ సాగు చేయటం ద్వారా మేలైన ఫలితాలు వస్తాయని వరంగల్ వ్యవసాయ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఈ.రాంబాబు, ఎస్‌ఆర్ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బి.సోమ్రాజ్ అన్నారు. నర్సరీ పెంపకంలో భాగంగా మహబూబాబాద్ మండలంలోని మల్యాల కృషిజ్ఞాన కేంద్రంలో ఆర్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో 2025కుగాను 30 మంది రైతులకు నైపుణ్య శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మల్యాల కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ బి.దిలీప్ కుమార్ మాట్లాడుతూ.. శిక్షణ కార్యక్రమాల వల్ల రైతులకు మిర్చి, వివిధ కూరగాయల పంటలు, నారు, యాజమాన్యంపై అవగాహన వస్తుందని సూచించారు. ఈ సమావేశంలో ఆర్య ఇన్‌చార్జ్ శాస్త్రవేత్త బి.క్రాంతికుమార్, మల్యాల ఉద్యాన పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త కె.నాగరాజు, ఉద్యాన శాస్త్రవేత్త ఎల్.సుహాసిని, రైతులు పాల్గొన్నారు. శిక్షణ అనంతరం రైతులకు సర్టిఫికెట్లు అందజేశారు.

సైబర్ మోసాలపై అవగాహన ఉండాలి

మహబూబాబాద్ రూరల్: సైబర్ మోసాలపై ప్రజలు అవగాహన ఉండాలని మానుకోట ఎస్బీఐ నెహ్రూ చౌక్ బ్రాంచ్ మేనేజర్ శ్రీకాంత్ అన్నారు. మండలంలోని కంబాలపల్లి గ్రామంలో ఎస్బీఐ నెహ్రూ చౌక్ బ్రాంచ్ ఆధ్వర్యంలో సైబర్ మోసాలు, నేరాలు, సామాజిక భద్రతా సంక్షేమ పథకాలపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ యాదగిరి పాల్గొన్నారు.

గూడూరులో అవగాహన సదస్సు
గూడూరు: సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన ఉండాలని ఎస్సై బి. గిరిధర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం ప్రిన్సిపాల్ ఆర్.పరశురాములు అధ్యక్షతన సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రోగ్రాం ఆఫీసర్ చిట్టిబాబు, గీత పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో పూజారికి తీవ్రగాయాలు



కార్తీక్ శివచార్యులకు చికిత్స అందిస్తున్న అంబులెన్స్ సిబ్బంది

కురవి: మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ముందు జాతీయ రహదారిపై బైక్ కుక్కను ఢీకొట్టిన ఘటనలో పూజారి కార్తీక్ శివాచార్యులు తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు ఇలా ఉన్నాయి. పూజారి కార్తీక్ శివాచార్యులు శనివారం రాత్రి కురవిలో వినాయక మండపాల వద్ద పూజలు చేశాడు. అయ్యగారిపల్లిలోని ఓ మండపం వద్ద గణనాథుడికి పూజలు చేసేందుకు తన బైక్‌పై వెళ్తున్నాడు. పోలీస్ స్టేషన్ ఎదురుగా రహదారిపై అడ్డుగా వచ్చిన కుక్కను ఢీకొట్టాడు. దీంతో కుక్క అక్కడికక్కడే మృతి చెందింది.ఈ క్రమంలో కార్తీక్ రోడ్డుపై పడిపోవడంతో కుడికాలు విరిగింది. చేతులు, కాళ్లకు తీవ్రంగా గాయాలయ్యాయి. వెంటనే కానిస్టేబుల్ కాశీరాం 108వాహనం ద్వారా మహబూబాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించాడు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి



మహబూబాబాద్ రూరల్: స్థానికులతో మాట్లాడుతున్న సీఐ మహేందర్ రెడ్డి

మహబూబాబాద్ రూరల్: నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయని టౌన్ సీఐ గట్ల మహేందర్ రెడ్డి అన్నారు. వినాయక చవితి నవరాత్రుల సందర్భంగా పట్టణ శివారులోని జ్యోతిబసు నగర్, నున్న నారాయణరావు నగర్, కురవి గేట్ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన గణేష్ మండపాలను టౌన్ సీఐ మహేందర్ రెడ్డి శనివారం సందర్శించారు. డీజేలకు ఎలాంటి అనుమతిలేదని పేర్కొన్నారు. ఈ సందర్భనలో టౌన్ అడ్మిన్ ఎస్సై ప్రశాంత్ బాబు, బ్లూకోల్ట్స్ సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడవద్దు
మహబూబాబాద్ అర్బన్: అనవసరమైన లింక్‌లు కిక్ చేసి, ఓటీపీలు చెప్పి సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడవద్దని టౌన్ సీఐ గట్ల మహేందర్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని కంకరబోర్డు జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో శనివారం సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కోట్యానాయక్, ఎస్సైలు ప్రశాంత్ బాబు, శివ, మౌనిక, కరుణాకర్, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

యాదవులు రాజకీయ రంగంలో ఎదగాలి



పెద్దవంగర: వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న యాదవులు

తొర్రూరు/పెద్దవంగర: యాదవులు రాజకీయ రంగాల్లో ఎదగాలని, టీపీసీసీ ఓబీసీ విభాగం వర్కింగ్ చైర్మన్ మేకల వీరన్న యాదవ్ అన్నారు. శనివారం డివిజన్ కేంద్రంలోని విశ్రాంతి భవనంలో యాదవ సంఘం నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. వచ్చే నెల 5న జిల్లా కేంద్రంలోని యశోద గార్డెన్‌లో నిర్వహించ తలపెట్టిన సభకు సంబంధించిన పోస్టర్లను యాదవ సంఘం నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. యాదవులు, గొల్ల కురుమ వర్గాల ఐక్యతతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు సుత్రపు రాజు యాదవ్, మేకల శివ, పయ్యావుల ప్రవీణ్, బొమ్మెరబోయిన వెంకన్న, బసనబోయిన రాజేష్, మహేష్, రాఘవులు, హరీష్, కుమార్, శ్రీనివాస్ యాదవ్‌లు పాల్గొన్నారు.

మళ్లీ విజృంభిస్తున్న 'లంపీ స్కిన్'



లంపీ స్కిన్ వ్యాధి సోకిన దూడ

దంతాలపల్లి: పశువుల్లో పోయిందనుకున్న లంపీ స్కిన్ వైరస్ (ముద్ద చర్మం వ్యాధి) మండలంలో మళ్లీ విజృంభిస్తోంది. లంపీస్కిన్ వ్యాధి అనేది పశువుల్లో వైరస్ వల్ల కలిగే అంటువ్యాధి. ఓ పశువు నుంచి మరో పశువుకు వేగంగా సోకుతుంది. పశువుల చర్మంపై దద్దుర్లు వస్తాయి. ముఖ్యంగా ఈవ్యాధి 1నుంచి 5సంవత్సరాల వయస్సు కలిగిన తెల్ల పశువుల్లో ఎక్కువగా సోకుతుంది. వ్యాధి సోకడం వల్ల పశువుల్లో దీర్ఘకాలిక బలహీనత, పాల ఉత్పత్తి తగ్గడం, సరైన క్రమంలో పెరగకపోవడం, ఆడ పశువులలో గర్భస్రావం కలగడం, వ్యాధి సోకిన పశువుల శర్మం ఎండిపోయినట్లు ఉండడం లాంటి లక్షణాలు కలిగి ఉంటాయి. ప్రస్తుతం మండలంలో మూడు పశవులకు వ్యాధి సోకింది. వ్యాధి సోకిన పశవులకు వైద్యులు చికిత్స అందిస్తున్నారు. గత రెండు సంవత్సరాల నుంచి ఈ వ్యాధి సుమారు 30పశువులకు సోకాయి. గత సంవత్సరం రెండు పశువులు ఈవ్యాధితో మృతి చెందాయి. పోయిందనుకున్న వ్యాధి మళ్లీ మండలంలో రావడంతో పాడి రైతుల్లో ఆందోళన మొదలైంది.

ముందస్తు చర్యలే రక్షణ
పశువుల్లో ఈ వ్యాధి సోకకుండా ఉండాలంటే ముందస్తు జాగ్రత్తలే రక్షణ అని సంబంధిత శాఖ అధికారులు అంటున్నారు. పశువులు ఉండే ప్రదేశం శుభ్రంగా ఉంచుకోవాలి. మురుగు నీరు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. అలాగే ఈగలు, దోమల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి. పశువులు నళతగా కనిపించినట్‌లైతే చికిత్స చేయించాలి.

చికిత్స అందిస్తున్నాం..



మండలంలో ప్రస్తుతం వ్యాధి సోకిన పశువులకు చికిత్స అందిస్తున్నాం, ప్రతి సంవత్సరం పశువులకు టీకాలు వేయించడం మంచిది. టీకాలు వేయడం వల్ల పశువుల్లో రోగనిరోధక శక్తి పెరిగి కొన్ని జబ్బులు రాకుండా ఉంటాయి.
- నౌసిని, మండల పశువైద్యురాలు

సంక్షిప్త సమాచారం

చదువుపై దృష్టి పెట్టాలి
నెల్లికుదురు: కళాశాలల్లో చదువుకుంటున్న విద్యార్థిని విద్యార్థులు చెడు ఆలోచన లకు స్వస్తిపలికి చదువుపై దృష్టిపెట్టి ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఎస్సై చిర్ర ర మేష్ బాబు, షీటీం ఎస్సై సునంద అన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం షీటీం భరోసా, మానవ అక్రమ రవాణ నిరోధక విభాగం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

పరిహారం చెల్లించాలి
గార్ల: యూరియా కొరతతో పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కందునూరి శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో వీరస్వామి, మల్లయ్య, ఇస్తారి, సర్వర్, ప్రవీణ్ పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదగాలి
పెద్దవంగర: విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నతస్థాయికి చేరుకోవాలని ఎంఈఓ బుదారపు శ్రీనివాస్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎక్స్‌రోడ్డు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఐడీ కార్డులు, టై బెల్ట్, నోట్‌బుక్స్ తోపాటు పలకలను పంపిణీ చేశారు. అనంతరం పాఠశాల్లో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని ఎంఈఓ ప్రారంభించి, మొక్కలు నాటారు. హెచ్‌ఎం సత్యనారాయణ, ఏఏపీసీ చైర్మన్ రమ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ప్రభాకర్
గంగారం: జిల్లా కేంద్రంలో జరిగిన అఖిల భారత ఐక్య రైతు సంఘం పథమ మహాసభల్లో మహబూబాబాద్ జిల్లా గంగారం మండలంలోని పందెంగ్రామానికి చెందిన పూనెం ప్రభాకర్‌ను రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ఏకగ్రీవంగా ఎన్నిక చేశారు.

వేతనాలు ఇప్పించాలని వినతి
కురవి: మండలంలోని నేరడ మోడల్ స్కూల్/కళాశాలలో పదేళ్లుగా ఔట్‌సోర్సింగ్‌లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు వేతనాలు ఇప్పించాలని ఉద్యోగులు శనివారం ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీకాంత్‌కు వినతిపత్రం అందించారు.

విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి
గూడూరు: విద్యుత్ ప్రమాదాలపై రైతులు అప్రమత్తంగా ఉండాలని విద్యుత్ శాఖ డివిజన్ ఇంజనీర్లు పి.విజయ్, హీరాలాల్ అన్నారు. మండలంలోని మచ్చర్ల, నాయకపల్లి గ్రామాల్లో శనివారం విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో పొలంబాట నిర్వహించారు. కార్యక్రమంలో ఏడీఈ కె. కవిత, సబ్ ఇంజనీర్ లక్ష్మణ్, ఏఈ మెట్టూరాం, సిబ్బంది పాల్గొన్నారు.

వీధి దీపాలు ఏర్పాటు చేయాలి



మహబూబాబాద్: జిల్లా కేంద్రంలో పలు కాలనీల్లో వీధిదీపాలు లేక రాత్రి కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారని సీపీఎం టౌన్ వన్ కార్యదర్శి రావుల రాజు ఆవేదన వ్యక్తం చేశాడు. పార్టీ ఆధ్వర్యంలో శనివారం డీఈ సీహెచ్ ఉపేందర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు భాగ్యమ్మ, యాకయ్య, నాగన్న, శ్రీనివాస్, యాకన్న పాల్గొన్నారు.

స్థల పరిశీలన
దంతాలపల్లి: మండలకేంద్రంలోని భవిత భవన నిర్మాణానికి శనివారం మండలకేంద్రంలోని ఎంపీపీఎస్ పాఠశాలలో ఏఎంసీ వైస్ చైర్మన్ బట్టు నాయక్, నాయకులు స్థల పరిశీలన చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మధుసూదన్, నాయకులు సంపెట సురేష్, బాలాజీ పాల్గొన్నారు.

నిమజ్జనం ప్రశాంతంగా జరుపుకోవాలి
దంతాలపల్లి: గణేశ్ నిమజ్జనం ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్సై పిల్లల రాజు అన్నారు. మండలంలోని వివిధ గ్రామాలలోని గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులతో పోలీసుస్టేషన్‌లో శనివారం సమావేశం నిర్వహించారు.

నివాళి
నెల్లికుదురు: నిజమైన కమ్యూనిస్టు కార్యకరత్త అంటే నెలకుర్తి సీతారాంరెడ్డి అని సీపీఎం రాష్ట్ర క్యాదర్శి వర్గ సభ్యుడు జి.నాగయ్య కొనియాడారు. మండలంలోని బంజర గ్రామంలో నెలకుర్తి సీతారాం రెడ్డి సంతాప సభ శనివారం గుణగంటి రాజన్న అధ్యతన నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు రాములు, చిన్న చంద్రన్న, సాదుల శ్రీనివాస్, రవి పాల్గొన్నారు.

బీమా సౌకర్యం పొందాలి
కురవి: ఎస్‌బీఐ ఖాతాదారులు బీమా సౌకర్యం పొందాలని మహబూబాబాద్ ఇందిరాగాంధీ చౌక్ ఎస్‌బీఐ మేనేజర్ ధారావత్ సునీల్ అన్నారు. శనివారం మండలంలోని నేరడ గ్రామంలోని పోస్టాఫీసు వద్ద ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

మల్టీపర్పస్ వర్కర్‌పై చేయిచేసుకున్న ఎఫ్ఏ
కురవి: సీరోలు మండలం చింతపల్లి గ్రామ పంచాయతీలో మల్టీపర్పస్ వర్కర్‌గా పనిచేస్తున్న యమగాని వెంకన్నపై అదే గ్రామానికి చెందిన నాగేశ్వర్‌రావు అనే ఫీల్డ్ అసిస్టెంట్ దాడిచేశాడు. శనివారం గ్రామ పంచాయతీ వద్ద ఉన్న నర్సరీలో మొక్కలను గ్రామస్తులకు అందిస్తున్న సమయంలో ఫొటోలు తీయడంతో ఫోటోలు ఎందుకు తీస్తున్నావని చేయిచేసుకున్నట్లు వివరించారు. ఈసమయంలో పంచాయతీ కార్యదర్శి అక్కడే ఉన్నా గొడవ జరిగింది. ఫీల్డ్ అసిస్టెంట్‌పై చర్య తీసుకోవాలని వెంకన్న డిమాండ్ చేశారు.

గడ్డిమందు తాగిన వ్యక్తి మృతి
బయ్యారం: గడ్డిమందు తాగి ఆస్పత్రిలో చికిత్స పొంది ఇంటికి వచ్చిన ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన శనివారం మండలంలోని రామచంద్రాపురం(రెండేర్లగడ్డ)లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన చీమల వెంకన్న(45) మద్యానికి బానిస కావటంతో ఈనెల 24న భార్య కవిత మందలించింది. దీంతో మనస్తాపానికి గురైన వెంకన్న అదే రోజు గడ్డిమందు తాగాడు. కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం ఇల్లెందు ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం మహబూబాబాద్, వరంగల్ ఎంజీఎంకు తరలించగా వైద్యం పొంది శుక్రవారం డిచ్చార్జ్ అయ్యి ఇంటికి వచ్చాడు. ఈక్రమంలో పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడి తండ్రి లక్ష్మయ్య ఫిర్యాదు మేరకు ఎస్సై తిరుపతి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి పట్టివేత.. ఐదుగురి అరెస్ట్

బయ్యారం: గంజాయిని తరలిస్తున్న ఐదుగురు వ్యక్తులను శనివారం బయ్యారం పోలీసులు అరెస్ట్ చేశారు. గార్ల-బయ్యారం పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన సమావేశంలో సీఐ రవికుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బయ్యారంలోని గుండ్రాతిమడుగు క్రాస్‌రోడ్డు వద్ద ఎస్సై తిరుపతి వాహన తనిఖీలు నిర్వహిస్తున్నారన్నారు. ఈ క్రమంలో ఐదుగురు వ్యక్తులు మూడు మోటర్ సైకిళ్లపై రాగా వారిని పట్టుకొని విచారించగా వారి వద్ద రూ.15వేల విలువ చేసే 300గ్రాముల గంజాయి పట్టుబడింది. దీంతో గంజాయిని తరలిస్తున్న మండలంలోని ఇర్సులాపురం గ్రామానికి చెందిన జి.సాయి, బయ్యారానికి చెందిన ఎం.నవీన్, గార్ల మండలం గుంపెల్లగూడెంకు చెందిన ఆర్.సాయిప్రకాష్, వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం పోనకల్‌కు చెందిన జె.దిలీప్‌తోపాటుమరో మైనర్ బాలుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చామన్నారు. వీరి నుంచి మూడు మోటర్ సైకిళ్లు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీన పర్చుకున్నట్లు సీఐ పేర్కొన్నారు. గంజాయిని పట్టుకున్న ఎస్సై తిరుపతి, అదనపు ఎస్సై మహబూబీ, కానిస్టేబుల్స్ మోహన్, హరిదాస్, హోంగార్డు వెంకన్నను సీఐ అభినందించారు.

గణనాథుడికి ముస్లిం దంపతుల పూజలు



పూజలు నిర్వహిస్తున్న ముస్లిం దంపతులు

కేసముద్రం: వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన గణపతి మండపంలో ముస్లిం దంపతులు పూజా కార్యక్రమాన్ని నిర్వహించి మత సామరస్యాన్ని చాటిన సంఘటన మున్సిపాలిటీ పరిధి కేసముద్రంవిలేజ్‌లో శనివారం రాత్రి చేసుకుంది. గ్రామానికి చెందిన మహమ్మద్ ఖాజామియా, సలీమా దంపతులు, రాధాకృష్ణ యాదవసంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతి మండపంలో వేదమంత్రోచ్ఛరణల మధ్య స్వామివారికి పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు.